# 12 దేశభక్తి-గోంగూరపచ్చడి

"దేశమును ప్రేమించుమన్నా" అని మన మహాకవి ఎంతగా ప్రతిమాలుకున్నా చాలా కొద్దిమంది మాత్రమే దేశాన్నీ, దేశ సంపదనీ గాఢంగా ప్రేమించేందుకు అలవాటు పడటం విచారించదగ్గదే!

ఆ కొద్దిమందీ దేశాన్నీ, సంపదనీ ఘోరంగా ప్రేమిం చేసి, దొరికినంతా స్వంతం చేసేసుకుని, దాంతో మేడలూ, ఫ్యాక్టరీలూ వగైరాలు కట్టేసుకుని మిగిలింది దొడ్లో పెంట కుప్పల క్రిందో, బాత్రూం గోడలలోనో దాచేసుకుని సుఖించ టానికి అలవాటుపడిపోయారు. ఆ మాత్రం చేతగాని అమా యక దేశభక్తులు ఈ పుణ్యభూమిలో బ్రతకటానికే అనర్హులని తేలిపోయింది.

"దేశమంటే మట్టికాదోయ్! మనుషులోయ్!" అని కూడా సదరు కవిగారే ఓ వివరణ యిచ్చి వున్నారు. దాని సారాన్ని తెలివైన మన దేశభక్తులు బాగానే వంట పట్టించు కున్నారు కనుకనే మట్టి పిసుక్కుంటూ వస్తులుండటం లాంటి తెలివి తక్కువ పనుల జోలికి పోకుండా, మనుషుల్ని పిండు కుంటూ క్రొత్త బంగ్లాలూ, క్రొత్త ఇండస్ట్రీలూ వగైరాలు కట్టుకొని సుఖంగా ఉండటం నేర్చేసుకున్నారు.

ఇష్టం లేకుండా ఎంత మసాలా వేసినా ప్రేయసి వండిన గుత్తివంకాయకూర కూడా తినలేంగదా! మరి ఉన్నపళంగా దేశాన్నే ప్రేమించేయాలంటే ఎంత ఇష్టం, దేశభక్తి ఉండివుండాలి.

"దేశభక్తిని మించిన హీనమైన పాపం" మరోటిలేదని చలంగారు సెలవిచ్చారే అనుకోండి. కానీ, పాపం, ఆయనో అమాయకుడు. మేడలు కట్టుకోడం చేతగానివాడు. కనుకనే కృష్ణాగోదావరీ కల్లోలిత తరంగ పావనపుణ్యాంధ్ర భూమిన్" వదిలేసి "సదా నిల్వసాంబారు కాల్వలం తేలియాడు తమిళ దేశాన" సెటిలయిపోయాడు. అలాగ్గాక ఇక్కడే వారపత్రికో సచిత్ర మాసపత్రికో నడుపుకుంటూ బెజవాడ మురిక్కాల్వల ఒడ్డున మేడకట్టుకొని సన్మానాలు చేయించుకొంటూ ఉంటా నంటే మనమేం వద్దన్నామా? నీ పత్రిక కొనంగాకకొనం! అరువు తెచ్చుకునే చదువుతాం! అని బెదరగొట్టామా!

అయినా మన మహాకవిగారు దేశమును ప్రేమించమని అప్పీల్ చేశారేగాని విదేశములను ద్వేషించమని ఆర్డర్ వెయ్య లేదుగదా! మనవి అసలే విశాలహృదయాలూ పవిత్ర గుండె కాయలూనూ, 'సర్వే లోకా స్సమస్తా స్సుఖినో భవతు' అనే వేదాల, పురాణాల సారం మన రక్తంలో దేశభక్తి కన్నా జాస్తీగా జీర్ణించుకునున్నది.

అందుకే పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తున్నంతసేపూ మన అనన్య ప్రచారం. అల్పప్రచారం గల పత్రికలన్నీ సదా భుట్టో రాక్షసుడు రోజూ త్రాగే రక్తాన్ని గురించీ, వాడి కోరలకు

అమెరికావాళ్ళూ-చైనావాళ్ళు పెట్టే పదునుగురించీ రీసర్చులు చేశాయి. తీరా యుద్ధం పూర్తయి ఆయనగారు సిమ్లాకు విచ్చేయగానే ఆయనగారి కూతురిలో గల అప్సరాంశను గురించీ, ఆమెకున్న బృహస్పతంతటి తెలివిని గురించీ స్పెషల్ వ్యాసాలూ, ఫోటోలూ అచ్చేసి మన మట్టి బుర్రల్ని రిపేరు చేసేశాయి. ఇది మన విశాల హృదయానికీ, పవిత్ర గుండె కాయలకూ కొండగుర్తు కాదా!

అలాంటప్పుడు మన పుణ్యభారతంలోని అనేకమంది మేధావులూ, సైంటిస్టులూ, స్పెషలిస్టులూ విదేశాలకు వలస పోవటాన్ని గురించి మనం గ్లిసరిన్ కూడా లేకుండా ఏడ్చే యటం శుద్ధ అభారతీయం.

ఈ పుణ్యభూమిలో పుట్టి, ఇక్కడి గాలీ-నీరూ సేవిం చాక వాడు యెక్కడికెళ్ళినా ఎంత మారినా భారతీయుడే. ఎంత ఖరీదయిన ఫారిన్ సూటు వేసినా వాడి క్రాపులో ఏదో ఓ మూల చిన్న పిలకముడి ఉండకపోదు. అది స్వచ్ఛమైన భారతీయతకు చిహ్నం.

కనుకనే దశాబ్దాల క్రితమే మనదేశం వదిలిపోయి గణిత శాస్త్రవేత్తగా ప్రపంచ ప్రఖ్యాతి నందుకొని అమెరికన్ పౌరుడుగా సెటిలయిపోయిన డాక్టర్ చంద్రశేఖర్‌కు ఆమధ్య మనం ఓ "పద్మవిభూషణ్" బిరుదు పారేశాం, నువ్వు మా వాడివే నాయనా! మర్చిపోకు! "ఏ దేశమేగినా, ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి పుణ్యభారతిని" అని కూడా గుర్తు చేశాం.

చంద్రశేఖర్ మహాశయుడు అమెరికా వెళ్ళిన క్రొత్తలో తన పరిశోధనల్ని గురించి ఓ వ్యాసం రాసి ఆ సబ్జెక్టుకు సంబంధించిన పేరుగల పత్రిక్కి పంపగా సంపాదకుడు బాగోలేదని త్రిప్పి కొట్టాడట, అది జరిగిన కొన్నేళ్ళకు యీయనే ఆ పత్రికా సంపాదకుడయిపోయేడు. అదే మనదేశంలో అయితే కథ మరోలా నడచి ఉండేదిగదా! ఆ నిరుత్సాహానికి మన డాక్టర్‌జీ సైన్సుకీ సలాం కొట్టేసి తన తెలివితేటల్ని నాటు సారా వ్యాపారానికో, కల్తీమందుల బిజినెస్‌కో అంకితం చేస్తే మేడోటి కట్టి ఉండునుగదా! ఇండస్ట్రీలు పెట్టి రాజకీయాల్లోకి దిగి, దేవుడు మేలుచేస్తే మంత్రి అయి ఒకటేం ఖర్మ, అరడజన్ డాక్టరేట్లు ఫ్రీగా సంపాదించి ఉండునుగదా!

అందుకే గదా, "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అంటూ మన దేశభక్త బ్రాందీ సేవించిన కవులు మహోన్నతంగా పాడింది.

నిజానికి వీళ్ళంతా మన పుణ్యభూమిలో అవకాశాలు లేక విదేశాలకు పారిపోతున్నారనేది శుద్ధ అబద్ధం. వీళ్లేదో కనిపెట్టాం! కనిపెట్టాం! అంటూ కబుర్లు చెప్తారేగానీ, అవన్నీ మన వేదాల్లో నేడున్నాయి. ఆటంబాంబులూ, రాకెట్లూ విమానాలూ, టెలివిజన్లూ, గోంగోరపచ్చడీ, ఇత్యాదులేగాక వాటి తాతలూ, అమ్మమ్మలూ, నాయనమ్మలూ అన్నీ మనకిదివరకే ఉన్నాయి.

రెండొందల మందిని ఎక్కించుకునే జంబో జెట్ విమానాలొచ్చాయని ఏ వెర్రిబాగుల వాడేనా నోరుజారితే

"ఓస్ ! ఇంతేనా ! రాములవారు లంకనుండి కొన్నివేల మందిని పుష్పకవిమానంలో ఎక్కించుకొచ్చారు గదా !" అనగల రామప్పంతుళ్ళూ, అగ్నిహోత్రులూ మన పెత్తందార్ల నిండా వున్నారు.

అందుకే ఈ శాస్త్రజ్ఞులనబడే వాళ్ళంతా తమ పప్పు ఇక్కడ ఉడకదని తోకలు ముడిచేస్తున్నారు. అంతేగానీ మనం వీళ్ళనేం నిరాదరించటం లేదు.

విదేశాల్లో సెటిలయిపోయి, తమ పరిశోధనల్తో నోబుల్ ప్రైజులుకొట్టేసిన ఖొరానా, నర్లీకర్ లాంటి శాస్త్రజ్ఞుల కీర్తి కాంతులు మన తట్టలలో గాకుండా విదేశాల బుట్టలలో పడుతున్నందుకు మనం వాపోతుంటాం. మన ప్రభుత్వం వాళ్ళ పిలకలు దొరక్కపోతే కనీసం కాళ్లన్నా పట్టుకుని ఇక్కడికే లాక్కొచ్చి ఉంటే నోబుల్ ప్రైజుల రూపంలో చాలా ఫారిన్ ఎక్సేంజ్ దొరికి ఉండేదికదా! అనికూడా బాధ పడుతూంటాం. కానీ వాళ్ళను పోషించాలంటే మాటలా! లేబరేటరీలకూ వాటికీ కోట్ల రూపాయలు తగలేయాలి గదా దేశంలో ఎందరో అఫీసరు ఏర్ కండిషనర్లు లేకా, మంత్రులకు ఫారిన్ టూర్లకూ ప్రారంభోత్సవాలకూ డబ్బుచాలకా, రాజకీయవేత్తల బామ్మరుదులకూ, కంట్రాక్టర్లకూ, క్రొత్త మాడల్ కార్లూ, బంగళాలూ లేకా ఇబ్బంది పడిపోతూండగా మన ముత్తాతల ముత్తాతల ముత్తాతల నాడే పురాణాలలో,

వేదాలలో రాసిపెట్టివున్న వాటినే మళ్ళీ కనిపెట్టేందుకు గాను మనం అంత డబ్బు- అందులోనూ ప్రజలు కడుపులు కాల్చుకుని కట్టిన పన్నుల డబ్బు తగలేయటం భావ్యమా !

ఆ మధ్యనే ఓ శాస్త్రజ్ఞుడు ధామ్మని పీకపిసుక్కుని చచ్చాడు. తనకు న్యాయంగా రావాల్సిన ప్రమోషన్ మరెవరో పెత్తందారుగారి చుట్టానికి అన్యాయంగా ఇచ్చేశారని ఆయన బాధ. కానీ పెత్తందార్లవ్వాలంటే ఎంత కష్టం. ఎందర్ని కూడగట్టుకోవాలి? ఎన్ని గొర్రెల్ని మేపాలి! ఆ గొర్రెలకు ఏదో లాభం చూపకపోతే సపోర్ట్ ఎలా? పెత్తందార్ల ఇబ్బందుల్ని అర్థం చేసుకోవద్దా?

ఆ శాస్త్రజ్ఞుడే గనుక మన పవిత్ర గ్రంథాల్ని చదివి కాస్త వేదాంతం వంటపట్టించుకుంటే అన్యాయంగా ఆత్మహత్య చేసుకుని ఉండడు. ఆయన చేసే పని ఆఫీసులో వ్యవసాయాభివృద్ధిని గురించి ఆలోచించటం. వడ్ల గింజల్లో ఉండేవి బియ్యపు గింజలేనా? అని పరిశోంధిచటం. జీతం కనీసం ఓ రెండు వేలన్నా ఉంటుంది! కాని నిజంగా పొలాలలో తడుస్తూ, ఎండుతూ పనిజేసి వడ్లు పండించే వ్యవసాయ కూలీకి అందులో వందోవంతు జీతం కూడా రావటం లేదుగదా! ఈ పోలిక చేసి చూసుకుంటే ఎంత సంతృప్తి. అన్యాయంగా పీక పిసుక్కుని చావనక్కర్లేదు గదా!

ఢిల్లీలోనే పనిచేసే ఓ డాక్టరు సాబ్ ఈ మధ్యే ధామ్మని

మరో బాంబు ప్రేల్చేసి మహాబాధతో తన హృదయానిక్కడే వదిలేసి, బుర్రను మాత్రం జాగ్రత్త చేసుకుని విదేశాల కెళ్ళి పోయేడు. ఆయనగారో పెద్ద హాస్పటల్లో పెద్ద స్పెషలిస్టట. అలాంటి స్పెషలిస్టులు ఇండియా మొత్తం మీదే మరో అర డజన్ మంది కూడాలేరట. తన పరిశోధనలకు లేబరేటరీలు కావాలని అయిదేళ్ళపాటు మొరపెట్టుకోగా మన పెత్తం దార్లు సరేనని శాంక్షన్ చేసి, తీరా అది మరెవరో నోరుగల వాడికిచ్చేశారట. అదీ ఆయన బాధ. కానీ, మనది విశ్వ మానవ దృక్పథం. ఎవరికిస్తేనేం చెప్పండి. ఎవరో ఒకరి కిచ్చాం చాలదా! మన డాక్టర్ గారు ముందే తిరుపతి వెంకన్నకు మొక్కుకుని ఉండాల్సింది. శాంతి సహనాలకు నెలవయిన మన కర్మ భూమిలో అయిదేళ్ళు లెక్కలోవా! అయినా మన డాక్టర్ గారు ఆ ఫైలు చంకనేసుకుని ఆఫీసర్ల, మంత్రుల చుట్టూ తిరిగి శాంక్షన్ చేయించుకునుండాల్సింది. వాళ్ళవాళ్ళకు శ్రద్ధగా వైద్యం చేసి పెట్టి ఉండాల్సింది. ఆస్పత్రిలో రోగులు ఎలా చస్తే మనకేం.

ఈ ధాం ధాంలు ఇలావుండగా మొన్న బొంబాయిలో ఓ ప్రొఫెసర్ గారు తాజాగా ఇంకోధాం ప్రేల్చేసి విమాన మెక్కి "లండన్ స్వర్గము మెరుగీ బాంబే నరకము కంటెన్" అని పాడుకుంటూ బ్రిటిష్ ప్రభుత్వానికి సలహాదారుగా వెళ్ళి పోయాడు.

ఈ ధాం గారు విశ్వవిఖ్యాతి నందిన ఆర్థిక శాస్త్రవేత్త

అట. అందులోనూ రవాణావిషయాలలో స్పెషలిస్టట. రవాణా లారీలలో జరిపితే చౌకా? లేక కూలీల వీపుల మీద జరిపితే చౌకా? లాంటి విషయాల్లో పరిశోధనలు చేస్తారేమో! అంత గొప్పవాడికి ఇస్తామని చెప్పికూడా బొంబే యూనివర్సిటీ వాళ్ళు ఇల్లు యివ్వలేదట. కౌటిల్యుడి వంటి గొప్ప అర్ధశాస్త్రజ్ఞుడే చెట్టుక్రింద కూర్చుని తాటాకులమీద అర్ధశాస్త్రం రాశాడుగదా! అని యూనివర్సిటీ వాళ్ళు సాంప్రదాయకంగా ఆలోచించి ఉండవచ్చును. తప్పేం ఉందండీ!

అయితే, మన పురోగమనం ఎలాగంటారా! దాందేముంది! మన వేదాలు చెపుతున్నట్లు దేనికయినా కాలం కలిసి రావాలి గదా! అందాకా కాలక్షేపానికి తెలుగు సినిమాలూ, గోంగోర పచ్చడీ సీరియల్ నవలలూ ఉండనే వున్నాయి.

(సెప్టెంబర్ 1972)